

# నీడా-నిజం

పి.వి.ఆర్. శివ కుమార్

"బెల్ మారో భాయ్ ...బెల్ మారో..."

'ఠంగ్... ఠంగ్...' గంట మోగింది. బస్ కదిలింది. బస్ నిండా జనం క్రిక్కిరిసిపోయి ఆ బస్సు భారత దేశానికి ప్రతీకలాగుంది! సీట్లలో కూర్చుని జనం. మధ్యలో నుంచునిజనం. దారిలోనూ, ఫుట్ బోర్డ్ మీదా 'నిలబడ్డ స్థితి' లో జనం!

బయట వ్రేలాడుతున్న వాళ్లందరూ లోపలికి చొరబడాలని ప్రయత్నం—అప్పటికే చొరబడినవాళ్ళు బయటివాళ్ల నరికట్టే యత్నం - బ్రతుకులో సోపానాల్నధిరోహించటంలో పోటీలా యిక్కడా మెట్లెక్కడానికి పోటీ! మధ్య తరగతి మెంటాలిటీకి మొదటి రకంగా ప్రదర్శనం!

తూలి పడబోయి, పైనున్న కడ్డీ పట్టుకు, యీదుకుంటూ ముందుకు నడిచాడు అనంతం.

'అబ్బ! డబుల్ డెక్కర్లోగూడా ఎంత రష్షో! మనస్సులోనే అనుకునానిడు.

అప్పుడే ఆఫీసులన్నీ వదిలారు. అందుకే అంతటా రష్! రెండు బస్సులు వరసాగ్గా వెళ్ళినా స్టాపులో మరో బస్‌కి సరిపడ్డ జనం!

'కోనై జీ కోనై టికేట్ లేనేకా ?'

అరుచుకుంటూ జనంలో తిరుగు తున్నాడు కండక్టర్. పూర్తి డబ్బు లిచ్చిన వాళ్లకి కసకసా టికెట్లు కోసే స్తున్నాడు. అర్ధ ఛార్జియో, పది పైసలో చేతిలో పెట్టిన వాళ్లవంక ఆదరంగా చూస్తూ ఆ డబ్బుల్ని బాగ్‌లో వేసేసుకు ముందుకి సాగిపోతున్నాడు.

'వెధవ్వేషాలూ... వెధవ జన మూనూ! మళ్ళీ మాటాడిస్తే, ఒకోడూ దేశోద్ధారకుల్లా ఖబుర్లు! బస్ టికెట్ కొనాచ్చే సరికల్లా కండక్టర్‌తో లాలూచీ? గవర్మెంటు నెత్తికి చెయ్యి! గవర్మెంటెవరిదో... మన్దికాదూ?' తనకంత చొరవ లేదన్న బాధతో, మనసులోనే తిట్టుకున్నాడు అనంతం.

'ఆప్ లియే సాబ్? ఆప్ లియే?' వరసాగ్గా అడుగుతూ వస్తున్నాడు. జేబులో చెయ్యి పెట్టాడు అనంతం. చిల్లర పదిహేను పైసలూ వేళ్ళకి తగి లింది.

'ఎలా? చిక్కడపల్లికి టికెట్టు యిరవయ్యయిదు పైసలు. వెధవ పది పైసల కోసం, ఉన్న ఒక్క అయిదు రూపాయల నోటూ మార్చాలి!'

పోనీ, 'కామ్'గా పదిపైసలు మాత్రం చేతిలో పెట్టేసి, టికెట్ అడక్కుండా వూరుకొంటే?

అమ్మో!... మధ్య దార్లో ఏ చెకింగ్ కలక్టార్రి వస్తే... ఎలాగూ రాడు! ఆ సంగతెలిసీ, అనంతమలా చెయ్య లేడు. అంత ధైర్యమే వుంటే, అసలంత సేపాలోచించనే... చించడు.

"టికెట్ లియే సాబ్?"

కండక్టర్ మాటల్తో వులిక్కిపడి, అప్రయత్నంగానే, జేబులోని ఐదురూపా యల నోటు తీసి అందించాడు:

"చిక్కడపల్లికి ఒకటి."

"చిల్లర లేదు సాబ్..."

"నాదగ్గిరా లేదయ్యా..." చికాగ్గా అన్నాడు అనంతం.


"అయితే జర వుండండి. మల్ల యిస్తా."

టికెట్ చింపి, పెన్సిల్తో వెనకాల 4-75 అని వేసి, ఇనిషియల్ చేసి చేతిలో పెట్టి ముందుకు సాగిపోయాడు కండక్టర్. నాలుగు సార్లు వెనకదంతా చూసి, భద్రంగా జేబులో పెట్టుకున్నా డనంతం.

'లిబర్టీ...' కండక్టర్ పొలికేక.

కిటికీ లోంచి తొంగి చూశాడు.

'డబల్‌డెక్కర్లోయీ రూట్నరావటం యిదే మొదలు. లిబర్టీ టాకీస్ యింత చిన్నగా వుందేం? పయిన్నించి చూడబట్టా? ఇంతకీ ఏం సినిమా ఆడు తోందీ? 'వరల్డ్ బై నైట్'...అర్ధనగ్న




సుందరుల అర్ధరాత్రి చర్యల్ని చూపి స్తాడు గావును! పైగా, 'ఏ' సర్టిఫికెట్ ఒకటి! అంటే ప్రత్యేకంగా పిన్నలకి ఆహ్వానం! వీళ్ళుకదూ జనాభా నిలా చెడగొడుతోంది?'

బస్సు కదిలింది... ఆలోచనలూ కదిలాయి.

'ఇంత కష్టపడీ వెళ్తే, యింతకీ సత్యం యింట్లో వుంటాడా? ఏమోఁ! వాణ్ణి నమ్మిచావలేం! ఒక్క క్షణం కొంపలో తగులడ్డు! ఆఫీసొదిలిన కాణ్ణించీ భద్రతా ఏజంటులా ఒకటే తిరుగుడు!... ఏ రోడ్లు సర్వే చేస్తాడో ఏమో! ఏమో, వాడిస్తానన్న డబ్బు మీద ఆశపెట్టుకునే వెళ్తున్నాడు తను!

నెల యింకా పదిహేన్రోజులన్నా కాలేదు - లేదా - యింకా పదిహేన్రో జులన్నా గడవాలి. అప్పుడే పైసలేదు చేతిలో! మధ్యాహ్నం ఫోనుచేసి అడిగాడు తను, ఓ యాభై వుంటే సర్దమని! అయిదు నిముషాలు నాన్చి, నాన్చి అన్నాడు:

"సాయింత్రం యింటికిరా. మా ఆవిడ దగ్గర అడుగుతా, నాదగ్గ రేవుఁంది?.." అవటాని!

జోరూకా గులాం గాడు! ఆవిడో ఇందిరాగాంధి! తన్ని వేళ కరుణిస్తుందో, ఆంధ్రప్రదేశాన్నిలా తిరస్కరించి పారేస్తుందో! ఆవిడగాని యివ్వనందా, ఇహ తన పని గోవింద! ఈ వున్న అయిదు రూపాయలతో ఎన్నాళ్ళు...

అరె! అయిదు రూపాయలు!... అవును, అయిదు రూపాయలు! ఇంకా చిల్లరివ్వలేదేం యీ కండక్టరు? ఎంత దూరముంది చిక్కడపల్లి యింకా?

హిమాయత్‌నగర్ టర్నింగ్ తీసు కుంటోంది బస్.

'మరో మూడు స్టాపులున్నాయి, ఫర్వాలేదు. అయినా, యింకా ఎందుకివ్వ లేదు చెప్మా వీడు? ఏమో... ఈ బస్ కండక్టర్లని నమ్మటానికి వీల్లేదు మర్చి పోతామేమో, ఎగేద్దామనే ఎత్తు! ఛ... ఛ... అవినీతి యింత దారుణంగా ప్రబలిపోబట్టే లోకమిలా తగులడి పోతోంది. ప్రతి వాడికీ కావాలి డబ్బు. మళ్ళీ, కష్టపడటాని కెవడికీ వొళ్ళొం గదు.

అందుకని కాదూ యీ లాట్రీల వాళ్ళూ, గుర్రాల వాళ్ళూ యింతలా డబ్బులు పోసుకుంటోంది!

ప్రతి వాడికీ నెల మొదట్లో వచ్చే జీతం మీదికన్నా, ఆ నెల్లోవచ్చే లాటరీ ఫలితాల మీదే దృష్టి.

'అయ్యోరాత! యింకా చిల్లరివ్వడేం వీడు? అసలెక్కడున్నాడు?'

పక్కవాడి మీంచి వొంగి మరీ చూశాడు బస్సంతా, అనంతం.

'అరె, ఏడి? మొత్తం బస్సులో ఎక్కడా లేడే? కొంపదీసి బస్సుగాని దిగి పోలేదు గద!

తన ఖంగారుగానీ, ఎలాదిగుతాడు?

ఏమో, కింది కండక్టర్‌కి డ్యూటీ వప్పజెప్పి, మళ్ళీ తిరిగొచ్చేటప్పు డెక్కు తానన్జెప్పి...

సాధ్యమేనా యిలా?

ఛ. ఛో... వెధవనుమానాలూ నువ్వూనూ! ఈ రోజుల్లో ఏది సాధ్యం కాదు? వాళ్ళిద్దరికే సవాలక్ష లాలూచీ లుంటై! యీ అయిదు రూపాయిల్లో వాడికో రెండు వాటా పెడితేసరి. అయి పోయింది. ఆ అయిదు రూపాయల నోటూ పోయినట్టే! యిప్పుడెలా? చేతిలో పదిహేను పైసలకి మించి మరో దమ్మిడీ గూడా లేదే, ఎంత హీనమైన పరిస్థితి!

ఈ టికెట్టు పట్టుకెళ్ళి, ఆర్టీవో ఆఫీసులో అడిగితే?

ఏమో, 'ఈ' కోడి గిలుకుడు 'ఫలానా కండక్టరు సంతకమే' నని ఏమిటి రుజువు?నువ్వు గీసుకొచ్చావ్వుపో' మ్మని తరిమితే?

ఛ... ఛ... బుద్ధితక్కువై చిల్లర లేకుండా బస్సెక్కాను! అయిదు రూపా యలూ అర్పణ!

ఛీ... సత్యానికి చోట్లేకండా పోయిందీ లోకంలో. నీతికి, నిజాయితీకీ కాలం తీరిపోయింది.

చూద్దాం, ఒహవేళ వాడు క్రిందనే వున్నా వున్నాడేమ్మో! అరె, అప్పుడే 'వెంకటేశ' వొచ్చేసిందే! ఇహ ఒక్క స్టాపుందంతే – త్వరపడాలి.'

గబ గబ సీట్లోంచి లేచి, గుమ్మం దగ్గరకు నడిచాడు. మెట్లు సగం దిగాడు...

'అర్నీ! మెట్ల కిందే నిలబడున్నాడు కండక్టర్! ఓరి వెధవా, నువ్విక్కడే వున్నావూ? ఇహనెట్లా తప్పించుకుపోతావో చూస్తాను.'

ఎవఁయ్యోయ్, నాచిల్లర డబ్బులు. పొలికేకపెట్టా డనంతం.

ఉలిక్కి పడి చూశాడు కండక్టర్. బస్సులో జనం మెట్ల మీది జనం గూడా వింతగా చూశారు అనంతాన్ని.

'ఏడిశారు. ఎలాచూస్తే ఎవడిక్కావాలి? ఒక్క పైస యిస్తాడా వూరికే, వీళ్ళలో ఎవడైనా?'

"ఇస్తా నుండవయ్యా! గట్ల పరేశానైతవేంది?" కసిర్నట్టుగా అన్నాడు కండక్టర్.

కసుర్తాడు. కసరడూ మరి! కొట్టేశాననుకున్న అయిదు రూపాయలూ దొరక్కుండా పోయె! ఎదురుగుండా లేకుంటే, బస్సు రద్దీలో మర్చిపోతాననుకున్నాడు గావును. నేనా? హుఁ—

జనాన్ని నెట్టుకుంటూ మెట్లుదిగే సరికి, చిక్కడపల్లి స్టాపు రానే వచ్చింది.

"లేలో సాబ్ ఆప్‌కీ పైసా..."

చెయ్యి చాపాడు అనంతం.

అరే, అదేమిటి! అయిదు రూపాయల నోటులో మరో కొన్ని రూపాయి నోట్లు పెట్టి యిస్తున్నాడు?... ఏమోలే, ముందు అందుకుంటే సరి. దిగాలి గబ గబ... టికెట్టు అతడి చేతిలో పెట్టి, గబుక్కున డబ్బు అందుకు హడావిడిగా దిగిపోయాడు అనంతం.

బస్సు కదిలి పోయింది దుమ్ము రేపుకుంటూ. అగరు ధూమంలా తోచిందా దుమ్ము అనంతానికి.

చటుక్కున గుప్పిడితెరచి చూశాడు. అయిదు రూపాయల నోటు, అందులో మరోనాలుగు రూపాయి నోట్లు, ఆపైన మూడు పావలా బిళ్లలు!

'అహ్హహ్హ! వెధవ! పది రూపాయల నోటిచ్చా ననుకున్నాడు గావును. వొదిలి పోయింది తెగులు. (! ?)

ఆహా! యివాళ లేచి ఎవడి మొహం చూశానో గానీ— అయిదు రూపాయలు... అప్పళంగా... లాభం."

ఆనందంగా ఆ డబ్బు జేబులో పెట్టుకుని, అరగంట నుంచీ ఆలోచిస్తున్న 'సత్యం' కోసం నడక సాగించాడు అనంతం.

